
మురుగు కాలువగా జీఎస్‌బీసీ

గుంతకల్లు: పట్టణంలోని పాతగుంతకల్లు మీదుగా ప్రవహిస్తున్న గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్ (జీఎస్‌బీసీ) మురుగు కాలువగా మారింది. పట్టణంలోని మహబూబ్‌నగర్ కాలనీ, ఉమామహేశ్వరనగర్, కాల్వగడ్డ, విజయనగర్ కాలనీ, హనుమేష్‌నగర్ ప్రాంతాల్లోని మురుగునీరంతా జీఎస్‌బీసీలో ప్రవహిస్తోంది. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తుంగభద్ర, హంద్రీనీవా జలాల్లోకి మురుగునీరు కలుస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

మురుగునీరు, వ్యర్థాలు కాలువలోనే..

జీఎస్‌బీసీ పొడవు దాదాపు 19 కి.మీ.లు ఉంది. గుంతకల్లు పట్టణంలోనే కాలవ 4 కి.మీ పొడవు ఉంది. ఈ కాలువ గుండా మండలంలోని రైతులకు సాగునీరందిస్తున్నారు. కాలువ గట్టున ఉన్న పై కాలనీల నుంచి రోజు లక్షల లీటర్ల మురుగునీరు, వందల కేజీల వ్యర్థపదార్థాలు చేరి మొత్తం చెత్త పేరుకుపోతుంది. దీంతో పందులు నిత్యం కాలువలో తిరుగుతూ దుర్గంధభరితంగా తయారైంది. అదేవిధంగా కాలువలో ముళ్లపొదలు పెరిగి నీటి ప్రవాహానికి ఇబ్బందికరంగా మారింది. దీని కారణంగా కాలవకు ఇరువైపుల ఉన్న ఇళ్లలోకి పాములు, క్రిమికీటకాలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు ప్రబలి అనార్యోగాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా కాలువ నిర్వహణ కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తుంటారు. అయినా కాలువ నిర్వహణపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయమై వార్డు కౌన్సిలర్ పీ.రవీంద్రబాబు ఇటీవల హెచ్ఎల్‌సీ అధికారులను కలిసి వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హంద్రీనీవా, తుంగభద్ర జలాలు రాక మునుపే కాలువలో పెరిగిన ముళ్లపొదలను, చెత్తచెదారం తొలగించే పనులను తక్షణం చేపట్టాలని ఆయా కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.


మురుగునీటితో నిండిపోయిన గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

తాడిపత్రి టౌన్: కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా సీఎం జగనన్న పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 31వ వార్డు పరిధిలోని శ్రీనివాసపురంలో గురువారం సాయంత్రం హర్షవర్ధన్‌రెడ్డి పర్యటించారు. వార్డు నాయకులు పేరం ప్రతాపరెడ్డి, పేరం ఆదినారాయణరెడ్డితో కలసి కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శ్రీనివాసపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను అప్యాయంగా పలకరించారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. అనంతరం వార్డుల్లో ప్రజల సమస్యలను హర్ష అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగనన్నదేన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాఘవేంద్ర, మాజీ కౌన్సిలర్లు బాబు, వరదలయ్య, రంగనాథరెడ్డి, సాయి, భాస్కర్, నాయకులు నాగర్జునరెడ్డి, హరినాథరెడ్డి, బాబా, సుబ్బారెడ్డి, రామకృష్ణ, లక్ష్మీరంగయ్య, సలామ్, గురుశంకర్, గణేష్, ప్రసాద్, శివయ్య, అంబటి రాఘవేంద్రరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వృద్ధురాలిని అప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

కార్మిక చట్టాలను అమలు చేయాలి

బుక్కరాయసముద్రం: కార్మికుల చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అధికారులను కోరారు. గురువారం సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న పసుపుల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఆఫీస్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్మికులకు రావాల్సిన బకాయిలు, పరిహారం సక్రమంగా అందించేలా చూడాలన్నారు. వేలాది మంది ప్రావిడెంట్ ఫండ్ ఖాతాల్లో పేర్ల తప్పులు, ఆధార్ లింక్ కాకపోవడం జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం పీఎఫ్ కమిషనర్ అశ్వణి రాజు మాట్లాడుతూ పీఎఫ్‌ను సక్రమంగా అమలు చేసేలా చర్యలు చేపడుతామన్నారు. ప్రతి నెలా 27న పీఎఫ్ అంశంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. పీఎఫ్ కార్యాలయం ఈఓ శ్రీనివాసనాయక్, చంద్రశేఖర్, వాటర్ సప్లయ్ యూనియన్ నాయకులు ఓబులేసు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

పెద్దవడుగూరు: తాడిపత్రి నియోజకవర్గంలోని రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. చిన్నవడుగూరులో రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం గ్రామానికి చేరుకొని బాధిత రైతులను పరామర్శించారు. అనంతరం బాధిత రైతులు చంద్రశేఖర్‌రెడ్డికి రూ.20 వేలు, వెంకటేష్‌రెడ్డికి రూ.20 వేలు, భాస్కర్‌రెడ్డి 20 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శేషారెడ్డి, రామచంద్రారెడ్డి, మధన్‌మోహన్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


బాధిత రైతులకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిలో సినిమా షూటింగ్


సినిమా షూటింగ్ ప్రారంభిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: స్థానిక శ్రీ చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో గురువారం మహతి ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్ పై లక్ష్మీ కటాక్షం (ఫర్ వోట్) సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. తాడిపత్రి పట్టణ, పరిసర ప్రాంతాల్లో 45 రోజుల పాటు షూటింగ్ చేపట్టనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. హీరోగా వినయ్ పాణిగ్రహి, హీరోయిన్ దీప్తివర్మ, నటుడు మహావీర్ రాయల్ నటిస్తున్నారు. కార్యక్రమంలో నిర్మాత శ్రీనివాసులరెడ్డి, లాయర్ ప్రతాపరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి రామకృష్ణారెడ్డి, మదన్‌మోహన్‌రావు, వాణి పాఠశాల చైర్మన్ గంగాధర్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక షాదీఖానాలో గురువారం పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆయుష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో బెంగళూరు శంకర ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ దివ్య 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 92 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ టీ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి పీసీ జయరామ్, డైరెక్టర్లు సుహాస్, రఘువీరరావు, షెక్షావలి, రోషన్ జమీర్, మనోజ్ పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్తు'


గుత్తిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


కత్తిమానుపల్లె గ్రామంలో జగనన్నే మా నమ్మకం బ్రోచర్లు అందిస్తున్న నాయకులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్ 7వ వార్డులో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని జోరుగా నిర్వహించారు. కౌన్సిలర్ వరదరాజులు, సచివాలయ కన్వీనర్ కెఎం రంగనాయకులు, భాస్కర్ బాబు నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులై ఉండి పథకాలు అందకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గృహ సారథులు, వార్డు వలంటీర్లు వైఎస్సార్ సీపీ నాయకులు స్టోర్ మస్తాన్, సలీమ్, అరుణ్, నరసింహ పాల్గొన్నారు.

జగనన్న పాలన స్వర్ణయుగం

యాడికి: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడం ద్వారా జగనన్న పాలన స్వర్ణయుగంగా మారిందని సచివాలయాల మండల కన్వీనర్ శివప్రసాద్ అన్నారు. గురువారం కత్తిమానుపల్లె గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం సీఎం పాలనపై సంతృప్తిగా ఉన్న ఇళ్లకు జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అతికించి, క్యాలెండర్లు, వారి ఫోన్‌ల ద్వారా మిస్డ్ కాల్ ఇప్పించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, నాగేంద్ర, గోపాల్ రెడ్డి, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: రామగిరి గ్రామంలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆత్మకమిటీ చైర్మన్ సోమశేఖర్, ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్, ఆదినారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రాలను పంపిణీ చేశారు.

వాసవీమాత జయంత్యుత్సవాలు ప్రారంభం



తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యాక పరమేశ్వరీదేవి ఆలయంలో గురువారం సాయంత్రం వాసవీ మాత జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజు గురువారం రాత్రి బాలకన్యకాదేవి అలంకారంలో వాసవీమాత భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్, కార్యదర్శి జయవరం ఆశ్వత్థరంగయ్య, ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి సుబ్రమణ్యం కోశాధికారి వంకదార చిన్న మద్దిలేటి (రాజా) కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

పెద్దవడుగూరు: కదరగుట్టపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జనార్ధన్‌రెడ్డి తండ్రి అశ్వత్థరెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా అశ్వత్థరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

ధ్వజ స్తంభం ప్రతిష్ట

గార్లదిన్నె: యర్రగుంట్లలో గురువారం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద గ్రామస్తుల ఆధ్వర్యంలో ధ్వజ స్తంభం ప్రతిష్ట చేశారు. ఈసందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు


రత్నకుమార్


హేమలత

గుత్తి: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ఫస్టియర్‌లో మొత్తం 82 మంది పరీక్షలు రాయగా 42 మంది పాసయ్యారు. సెకండియర్‌లో మొత్తం 163 మంది పరీక్షలు రాయగా 92 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ఎస్. వైష్ణవి 939(సీఈసీ), రాజేశ్వరి 881 మా ర్కులు(ఎంపీసీ), రెబెకా 865(హెచ్ఈసీ) సాధించారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌శర్మ తెలిపారు. మోడల్ పాఠశాలలో ఫస్టియర్‌లో మొత్తం 106 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 52 మంది(49 శాతం) పాసయ్యారు. సెకెండియర్‌లో మొత్తం 67 మంది పరీక్షలు రాయగా 41 మంది(61శాతం)మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ ఉష తెలిపారు. కస్తూర్బా పాఠశాలలో ఒకేషనల్ కోర్సుల్లో మొత్తం 39 మంది పరీక్షలు రాయగా 31 మంది(79.48 శాతం) పాసయ్యారు. ఇందులో గౌతమి అత్యధికంగా 500 మార్కులకు గాను 481 మార్కులు సాధించింది. వాణీబాయి 465, గురులక్ష్మి 457 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ రుద్రాక్షి తెలిపారు.

శింగనమల: శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ సెకండియర్‌లో 45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్ షఫీ తెలిపారు. సెకండియర్‌లో సీఈసీ, హెచ్ఈసీలో 48 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 22 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రత్నకుమార్ 912 మార్కులు, హేమలతకు 905 మార్కులు సాధించారన్నారు. ఫస్టియర్‌లో 37 మంది పరీక్షకు హాజరు కాగా, 13 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కేజీబీవీలో ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో 35 మంది పరీక్షలకు హాజరుకాగా, 14 మంది ఉత్తీర్ణత సాధించారని, అందులో నాగేశ్వరి 872 మార్కులు సాధించిందని ప్రిన్సిపాల్ ఝాన్సీ తెలిపారు.

తాగునీటి సమస్యపై అధికారుల నిలదీత

గుత్తి: తాగునీటి సమస్యపై కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ శ్రీనివాసులు, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ నేతృత్వంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు బుసా రూపావతి, ఖాజా ఖాన్, వరదరాజులు, ఫరూక్, వెంకట సుబ్బయ్య , అరవింద బాబు,కృపా సుజాత, మర్తాడు హసీనా తదితరులు సమావేశం ప్రారంభంలోనే తాగునీటి సమస్యపై అధికారులను నిలదీశారు. త్వరలోనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు వరలక్ష్మి, పద్మలత రెడ్డి మున్సిపాలిటీలో నెలకొన్న డ్రైనేజీ, తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏఈ శరత్‌చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం

మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాలు, పూల మాలలతో కమిషనర్‌ను సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పద్మలత, వరలక్ష్మి, కౌన్సిలర్లు నజీర్, వరదరాజులు, ఫరూక్ , మర్తాడు హసీనా,ఖాజా ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు గురు, మర్తాడు అన్సార్, కటిక ఖురేషి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

ఇరువర్గాల ఘర్షణ

గుత్తి రూరల్: అనగానదొడ్డి గ్రామంలో భూ వివాదమై గురువారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కంబయ్య, పి.ఎర్రగుడిలో ఉండే సోదరుడు రమేష్ మధ్య భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడిలో కంబయ్య అతడి భార్య మహాలక్ష్మి, మరో వర్గంలో ఆనంద్, భాస్కర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వారిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీపీఎఫ్ స్లిప్‌లు వచ్చేలా చూడండి

అనంతపురం అర్బన్: నాల్గో తగరతి ఉద్యోగులకు సంబంధించి జీపీఎఫ్ (భవిష్య నిధి) స్లిప్‌లు వచ్చేలా చూడాలని ఏటీఓ రాణికి నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు విన్నవించారు. గురువారం ఏటీఓని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, గౌస్‌పీరా, ఇతర నాయకులు డీడీ చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేసి, సమస్య వివరించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీపీఎఫ్ స్లిప్‌లు రాలేదన్నారు. నాలుగు డీఏలను కలిపి ఆ తరువాత తొలగించిన్పటి నుంచి ఈ సమస్య ఉందన్నారు. జీపీఎఫ్‌కు తాము ప్రతి నెలా ఎంత మొత్తం చెల్లిస్తున్నామో కనిపిస్తోందని, అయితే తమ ఖాతాలో ఎంత మొత్తం ఉందనేది రాలేదన్నారు.

క్లుప్తంగా

ఉచిత ఖత్నా


నిత్యావసరాలు అందిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: స్థానిక పోరాటకాలనీ మద్రస-ఎ- రహమత్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఖత్నా చేయించుకున్న పిల్లల తల్లిదండ్రులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఆ తర్వాత ఫయాజ్‌బాషా ట్రస్టు చైర్మన్ హీరాపురం ఫయాజ్‌బాషా హాజరై చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబయ్య, బషీర్, బాబా, మాబాషా, ప్రసాద్, రియాజ్, అబూబకర్, అయూబ్ బాషా, ఖలీల్, చవ్వా రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉపాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లు రూరల్: వై.టీ.చెరువు గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జాషువా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి


ట్రాన్స్‌కో డీఈకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీలో విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని గురువారం విద్యుత్ శాఖ అధికారులకు వైఎస్సార్‌సీపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు బళ్లారి రాజ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ట్రాన్స్‌కో డీఈ రాజశేఖర్, ఏడీఈ మేఘరాజ్, ఏఈ శ్రీకుమార్‌లకు వినతి పత్రాలు అందజేశారు. కొన్ని విద్యుత్ పోల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, మరి కొన్నింటిని మార్పు చేయాలని, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు త్వరితిగతిన పూర్తి చేయాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు సానుకూలంగా స్పందించారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు


పచ్చారుమేకల పల్లెలో 104 వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

యాడికి: రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి అప్పయ్య పేర్కొన్నారు. గురువారం పచ్చారుమేకల పల్లెలో మంచానికే పరిమితమైన రోగులు, ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని 45 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఓకు ఆర్థిక సాయం

పుట్లూరు: ఈ నెల 10న ఏ.కొండాపురం వద్ద కడవకల్లు వీఆర్‌ఓ పెద్దన్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం విదితమే. ఈయన వైద్య ఖర్చుల కోసం పుట్లూరు ఎంపీడీఓ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు రూ.46100ను ఫోన్ పే ద్వారా వీఆర్‌ఓ పెద్దన్నకు అందజేశారు. అపదలో ఉన్న తోటి ఉద్యోగి వైద్య ఖర్చుల కోసం ప్రతి ఒక్కరూ సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: జూటూరులో గురువారం జీపీఎం ఓఓ మధుసూదన్ రాజు ఆధ్వర్యంలో కంటి వెలుగు పథకం కింద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 66 మందిని పరీక్షించి 23 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. మే 25, 26, 27 తేదీల్లో సంచార వైద్యశాలలో కంటి ఆపరేషన్‌లు నిర్వహిస్తామని వైద్యులు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్, ఉషా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచండి


ఇంటింటా చెత్తసేకరణపై ఆరాతీస్తున్న కమిషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: ఇంటింటా చెత్తసేకరణతో పాటు వార్డుల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న వార్డు శానిటేషన్ కార్యదర్శులకు సూచించారు. గురువారం ఆయన పట్టణంలోని 14,10,16 వార్డుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటింటా చెత్తసేకరణ సక్రమంగా జరుగుతుందా లేదా అని ఆరా తీశారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భగీరథ మహర్షి జయంతి


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలో గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఉప్పర(సగర) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మొదట చెంబుల బావి వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. తదనంతరం భగీరథ మహర్షి చిత్ర పటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథం(ట్రాక్టర్)లో ఉంచి పట్టణంలోని పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉప్పర వీధిలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సంగర సంక్షేమ సంఘం నాయకులు, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎస్‌ఐను కలిసిన ప్రజా ప్రతినిధులు


ఎస్‌ఐను కలిసిన, జెడ్పీటీసీ భాస్కర్ నాయకులు

బుక్కరాయసముద్రం: ఎస్ఐగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసులకు తమ వంతుగా సహాయ సహకారాలు అందింస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుల్లే నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, సర్పంచ్‌లు శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, కాటమయ్య, జయరామిరెడ్డి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం


షిర్డీసాయి బాబాను దర్శించుకుంటున్న భక్తులు

గుత్తి: పట్టణంలోని కోట ముఖ ద్వారం సమీపంలో ఉన్న షిర్డీసాయిబాబా ఆలయం 30వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. షిర్డీ సాయి సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు జేకె రాము, డీఆర్ రాజేంద్ర, ఉపాధ్యక్షులు తిమ్మారెడ్డి, కె.ప్రదీప్ రెడ్డి, కె. సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటలకు వేడుకలు ప్రారంభమయ్యాయి. మీ సందర్భంగా ఆలయాన్ని రక రకాల విద్యుద్దీపాలతో అలంకరించారు. షిర్డీ సాయి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం స్వామికి పల్లకీ ఉత్సవం, రథోత్సవం నిర్వహించారు. అనంతరం వేలాది మందికి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గురుప్రసాద్, పెద్దన్న, విశ్వం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.